త్రివేణి సంగమం వద్ద హారతి



కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం శివయ్య సన్నిధిలోని మూడు నదుల సంగమం వద్ద గురువారం అర్చకులు హారతి సమర్పించారు. ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా అర్చకులు తీర ప్రాంతానికి వెళ్లి విశేష పూజలు చేసి హారతి ఇస్తుంటారు. అనంతరం మూడు నదుల సంగమానికి గుర్తుగా మూడు హారతులను సమర్పించారు. ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్, మాజీ ఆలయ ధర్మకర్త శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ధర్నా

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: బుధవారం పెద్దాపూర్ జంగుపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలుడు వెంకటేశ్వర్‌రావు కుటుంబానికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని జాతీయ రహదారిపై మృతదేహంతో ధర్నా నిర్వహించారు. ఎంతో నిర్లక్ష్యంగా లారీ నడిపి బాలుడి మృతికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడటంతో ధర్నా విరమించారు.

కిలోల్లో కొంటున్నారు
టన్నుల్లో తరలిస్తున్నారు!

జోరుగా రేషన్ బియ్యం దందా..

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, నర్సంపేట, కమలాపూర్, వరంగల్ క్రైం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దందా జోరుగా సాగుతోంది. పట్టణాలు, గ్రామాల్లోనే కాకుండా ఏజెన్సీ ప్రాంతాలకూ ఇది విస్తరించింది..

ఉమ్మడి జిల్లా పరిధిలోని 11,11,401 కార్డుదారులకు ప్రతి నెలా 2,266 చౌకధరల దుకాణాల ద్వారా సుమారు 23 వేల టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇందులో 2,250 టన్నులకుపైగా పక్కదారి పడుతోంది.

ఎలా చేస్తారంటే..

పేదల బియ్యంతో రూ.లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు, మిల్లర్లు.. పోలీసులకు చిక్కకుండా రకరకాల ఎత్తులు వేస్తున్నారు. రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల నుంచి సేకరించిన రాయితీ బియ్యాన్ని టన్నుల కొద్దీ నిల్వ చేస్తారు. అర్ధరాత్రి లారీల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తారు.



ఇది 30 టన్నుల రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీ. ఇటీవల మహారాష్ట్ర వైపు వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.

టాస్క్‌ఫోర్స్

1 రేషన్ దుకాణాల ద్వారా..

లబ్ధిదారులు తమ కార్డును కోల్పోకుండా ఉండేందుకు ప్రతి నెలా చౌకధరల దుకాణం వద్దకు వెళ్లి రేషన్ తీసుకుంటున్నట్లు వేలిముద్రలు వేసి వస్తున్నారు. దుకాణాదారుడు వారికి కిలోకు రూ.10 చొప్పున లెక్క కట్టి డబ్బులు ఇస్తున్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కొందరు డీలర్లు లబ్ధిదారులకు డబ్బులకు బదులు సబ్బులు, సర్ఫ్, గోధుమ పిండి, బొల్ల సబ్బులు అందజేస్తున్నారు. అలా పోగైన బియ్యాన్ని మిల్లర్లకు రూ.14 నుంచి రూ.16 చొప్పున రాత్రి సమయంలో మిల్లులకు తరలిస్తున్నారు.

2 సన్నబియ్యంగా మార్చి

రేషన్ దుకాణాలతో పాటు ఇంటింటా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు తమ రైస్ మిల్లుల్లో సన్నబియ్యంగా మార్చుతున్నారు. అలా మరపట్టిన బియ్యాన్ని 25 కిలోల సంచుల్లో నింపి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 మధ్య విక్రయిస్తున్నారు.

3 నూకలుగా..

పౌల్ట్రీఫారాలు, బీర్ల తయారీ కంపెనీల్లో నూకల వినియోగం పెరిగింది. దీంతో వాటికి డిమాండ్ అధికమైంది. దళారులు లబ్ధిదారుల నుంచి రూ.8 నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లర్లకు రూ. 12 నుంచి రూ.14 చొప్పున విక్రయిస్తున్నారు. నూకలుగా మరపట్టిన మిల్లర్లు కిలోకు రూ. 18 లేదా రూ.20 చొప్పున అవసరమున్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ డివిజన్‌లో కొందరు అక్రమార్కులు సామర్థ్యం తక్కువ కలిగిన మిల్లులను స్థాపించుకుని బియ్యాన్ని నూకలుగా మరపడుతున్నారు.

మాఫియాలా బియ్యం డాన్‌లు



వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలో లబ్ధిదారుల నుంచి అక్రమంగా బియ్యం కొనుగోలు చేసి బస్తా 50 కిలోలు కాగానే స్కూటీపై తీసుకెళ్తున్న యువకులు

ఉమ్మడి జిల్లాలో చౌక బియ్యం మాఫియా విస్తరిస్తోంది. జిల్లాకు ఇద్దరు నుంచి నలుగురు చొప్పున దందా చేస్తూ బియ్యం డాన్‌లుగా ఎదిగారు. యువత, మైనర్లు పావులుగా మారుతున్నారు. దళారులకు ద్విచక్రవాహనం, సంచులు, డిజిటల్ కాంటాలు అప్పగించి ఊళ్లలోకి పంపిస్తున్నారు. వారు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.8 నుంచి రూ.10 చొప్పున రేషన్ బియ్యం కొంటారు. డిజిటల్ కాంటాలపై తూకాలు చేస్తున్నారు. బస్తా బరువు 50 కిలోలు కాగానే వాహనంపై తమ రహస్య ప్రదేశానికి తరలిస్తారు. ఇందుకోసం అక్రమార్కులు పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో ఒక వ్యక్తి చక్రం తిప్పుతున్నారు. పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులను మచ్చిక చేసుకొని ఆ ప్రాంతంలో దందాను కొనసాగించే ఇతరులను పట్టిస్తున్నారు. తాను మాత్రం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు 15 నుంచి 20 క్వింటాళ్ల చొప్పున ప్రయాణికుల ఆటోల్లో నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు.

● హనుమకొండ జిల్లాలో బడా దళారీ అక్రమానికి అడ్డూ అదుపు లేదు. మండలాల వారీగా మధ్యదళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని రూ.కోట్లు గడిస్తున్నారు.

సీఎంఆర్ లక్ష్యం కోసం..

వరంగల్ జిల్లా నల్లబెల్లి, దుగ్గొండి, పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా గూడూరు, కేసముద్రం, మరిపెడ, హనుమకొండ జిల్లా కమలాపూర్ తదితర మండలాల్లోని మిల్లర్లే చౌక బియ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఏటా ధాన్యం కొనుగోలు సమయంలో వారికి కేటాయించిన ధాన్యాన్ని అధిక ధరలకు పక్కదారి పట్టిస్తున్నారు. సీఎంఆర్ లక్ష్యాన్ని భర్తీ చేసుకునేందుకు తక్కువ ధరకు లభించే పేదల బియ్యాన్ని టన్నుల కొద్ది కొనుగోలు చేస్తున్నారు. వాటిని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద లెక్కలు చూపిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ఇదీ పరిస్థితి..



హనుమకొండ జిల్లా పరకాలలోని శ్రవణ్‌కుమార్ బిన్ని రైస్‌మిల్లరు రాయితీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ పౌరసరఫరాలశాఖకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు మిల్లుపై దాడి చేశారు. అందులో రూ.12.81 లక్షల విలువ చేసే 325 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని, 187.5 క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నారు.

వైద్య విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ

ఈనాడు కథనానికి స్పందన

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వైద్య కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం ఈనాడులో ఎంబీబీఎస్ రెండో సంవత్సరంపై నీలినీడలు కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి వైద్య కళాశాలను సందర్శించారు. ప్రొఫెసర్లు, సింగరేణి అధికారులు, గుత్తేదారులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య కళాశాలను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వైద్య కళాశాలలో 120 మంది బాలికలు, 80 మంది బాలురు చదువుతున్నారని, సింగరేణి అధికారులతో చర్చించి అదనంగా రామప్ప కాలనీలో ఒక బ్లాక్, 14 క్వార్టర్లు కేటాయించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి వైద్య కళాశాల భవనాన్ని సంవత్సర కాలంలో పూర్తి చేస్తామన్నారు. రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతి గదులు, ప్రాక్టికల్ ల్యాబ్, లెక్చర్ హాల్‌ను 20 రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు కళాశాల నుంచి జిల్లా ఆసుపత్రికి వెళ్లడానికి రెండు బస్సులు ఏర్పాటు చేస్తామని, 21 నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశాలు పూర్తి కాగానే తరగతులు ప్రారంభించాలన్నారు. వైద్య కళాశాల అధ్యాపకులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం రామప్ప కాలనీలో విద్యార్థులకు కేటాయించిన క్వార్టర్లను సింగరేణి జీఎంతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌కుమార్, సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్, వైద్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా మయాంక్‌సింగ్

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) ఇన్‌ఛార్జిగా కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌ను నియమిస్తూ కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన వెంకటేశం డిప్యుటేషన్‌పై హైదరాబాద్ వెళ్లగా ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిగా మయాంక్‌సింగ్‌కు అవకాశం కల్పించారు.

సింగరేణి కార్మికులకు ఏకరూప దుస్తులు



దుస్తులు పంపిణీ చేస్తున్న అధికారులు

గణపురం, న్యూస్‌టుడే: గణపురం మండలం బస్వరాజుపల్లిలోని సింగరేణి ఓసీ 3లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గురువారం ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. మేనేజర్లు భానుప్రసాద్, రాంబాబు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు నూతన ఏకరూప దుస్తులు ధరించాలన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.

'సీఎం కప్ పోటీలకు సిద్ధం'



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: వచ్చే నెల చివరి వారంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలకు జిల్లా పరిధిలోని అన్ని గ్రామాలు, మండలాల నుంచి నైపుణ్యం గల క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ త్వరలో మొదలు కానుంది. యువతలో క్రీడా సంస్కృతి పెంపొందించాలని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని, వారు విశ్వ కీడ్రల్లో పతకాలు సాధించాలన్న ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా చీఫ్ మినిస్టర్(సీఎం) కప్- 2024 నిర్వహిస్తోంది. ఈ నెల 21 నుంచి విడతల వారీగా గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆయా క్రీడాంశాలలో పోటీలు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసింది. వర్ధమాన క్రీడాకారులు తమ ప్రతిభ చాటేందుకు ఇదొక చక్కని వేదిక అవుతుంది. సబ్ జూనియర్ (14 ఏళ్ల లోపు), యూత్, జూనియర్ (18 ఏళ్ల లోపు) మెన్ అండ్ వుమెన్ ఓపెన్ (18 ఏళ్లు దాటిన వారు) విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు. అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్లు, 400 మీ పరుగు, మహిళలకు 400 మీటర్ల నడక, పురుషులకు 800 మీటర్ల నడక పోటీలతోపాటు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో ఆటల పోటీలు కొనసాగుతాయి. బ్యాడ్మింటన్‌లో సింగిల్, డబుల్స్ మిక్స్‌డ్, బాక్సింగ్ పోటీల్లో 46, 48, 51, 54-57, 57-60 కిలోల బరువు విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఈత పోటీల్లో ఫ్రీ-స్టైల్ 100 మీ, బెస్ట్ స్ట్రోక్ 50 మీ, బ్యాక్ స్ట్రోక్ 50 మీ, బటర్‌ఫ్లై 50 మీటర్ల విభాగంలో పోటీలు ఉంటాయి. మండల స్థాయి పోటీలు ఈ నెల 26 నుంచి 30 వరకు, జిల్లా స్థాయిలో నవంబరు 8 నుంచి 13 వరకు కొనసాగుతాయి. రాష్ట్ర స్థాయి పోటీలు నవంబరు 28 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో సీఎం కప్ పోటీలు క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జరగనున్నాయి. జిల్లా విద్యాశాఖతో పాటు అన్ని క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు ఇందులో భాగస్వాములు కానున్నారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షురాలిగా సాంబలక్ష్మి



భూపాలపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలిగా స్థానిక రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గోపరాజు సాంబలక్ష్మిని నియమించినట్లు రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని కుల సంఘాల మహిళలను చైతన్యపర్చి ఉద్యమాన్ని ముందు వరసలో నిలిపినందుకే సాంబలక్ష్మిని జిల్లా అధ్యక్షురాలిగా నియమించినట్లు పేర్కొన్నారు. అన్ని మండలాల్లో ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



మేడిపల్లి వద్ద దారి సుంకం వసూలు కేంద్రం(టోల్ ప్లాజా)



దారి సుంకం వసూలు పట్టిక



మద్దులపల్లి వద్ద గుంతలు పడ్డ జాతీయ రహదారి

గుంతల దారికి సుంకం చెల్లించాలా?

న్యూస్‌టుడే, కాటారం

జాతీయ రహదారుల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం వివిధ ఏజెన్సీలకు దారి సుంకం వసూలు అప్పగిస్తోంది. 353(సీ) జాతీయ రహదారిపై మేడిపల్లి వద్ద వసూలు కేంద్రం(టోల్ ప్లాజా) ఏర్పాటుచేశారు. కొద్ది రోజుల్లో దీన్ని ప్రారంభించబోతుండగా, ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఏ వాహనానికి ఎంత టోల్ పన్ను వసూలు చేయాలనేది ఇప్పటికే నిర్ణయించారు. అయితే రహదారి నిర్వహణ అధ్వానంగా మారి, గుంతలు పడి ఇబ్బందులు పడుతున్నా.. దారి సుంకం చెల్లించాలా అని వాహనదారులు వాపోతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో ఈ దారి అక్కడక్కడా కుంగిపోగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిని మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ ఏదీ?



అంబేడ్కర్ కూడలిలోని ఖాళీ స్థలంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు..

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా పాలిథీన్ సంచుల వినియోగం పెరుగుతోంది. టీ కొట్టు మొదలుకొని వస్త్ర, మాంసం తదితర అన్ని దుకాణాల నుంచి వస్తువులు పాలిథీన్ సంచుల్లోనే తీసుకెళ్తున్నారు. అధికారులు దాడులు నిర్వహించి, పలు సందర్భాల్లో కొన్ని సంచులు పట్టుకుని జరిమానాలు విధిస్తున్నా తరువాత షరా మాములుగా వ్యాపారులు వినియోగిస్తూనే ఉన్నారు. కోల్ బెల్ట్ ప్రాంతమైన భూపాలపల్లి పట్టణంలోనే కాకుండా పలు కార్మిక కాలనీల్లో చాలా వరకు హోటళ్లలో తినుబండారాలను ప్లాస్టిక్ సంచుల్లోనే ఇస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై జాతీయ కాలుష్య నియంత్రణ మండలి విధించిన నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే భారీగా జరిమానాలు విధించటంతో పాటు కేసులు నమోదు చేయాలనే ఆదేశాలున్నా వీటి అమలు ఇక్కడ కాగితాలకే పరిమితమవుతోంది. ముఖ్యంగా పోలీసు స్టేషన్ ముందు భాగంలో నిత్యం జరిగే చేపల విక్రయదారులు సైతం ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 13,486 నివాస గృహాలున్నాయి. దాదాపుగా 90 వేలకు పైగా జనాభా ఉంటోంది. ప్రతి రోజు తడి, పొడి చెత్త కలిపి 14 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి అవుతోంది. వీటిలో సింహభాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటాయి. ప్లాస్టిక్ సంచుల్లోని పదార్థాలు తినడం వల్ల పలు రకాల క్యాన్సర్లు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం వద్దని అవగాహన కల్పించాల్సిన అధికారులు, పాలకులు మాత్రం నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్లాస్టిక్‌తో కూడిన ఫ్లెక్సీలు అధికంగా వినియోగిస్తున్నారు. జిల్లా కేంద్రంలో జవహర్ నగర్ కాలనీ నుంచి సీఆర్‌నగర్ వరకు జాతీయ రహదారికి ఇరుపక్కలా దుకాణాల ప్రారంభోత్సవాలు, పండగలు, సమావేశాల సందర్భంగా పోటా పోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వస్త్రంతో తయారు చేసినవి ఉపయోగిస్తే కొంత మేరకు మేలు జరుగుతుంది.

నియంత్రించేందుకు చర్యలు:

- అవినాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పాలిథీన్ వినియోగాన్ని నియంత్రించేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. దుకాణాలు, హోటళ్లలో అకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే స్థానిక వ్యాపారులతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సమావేశాన్ని నిర్వహించాం. మరోసారి కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసి, నిబంధనలకు వ్యతిరేకంగా వినియోగించే వారి నుంచి జరిమానాలు విధిస్తాం.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి



అధికారుల సమావేశంలో పాల్గొన్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామ్‌చందర్, పక్కన కలెక్టర్, ఎస్పీ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి సంక్షేమ పథకం అర్హులైన నిరుపేదలకు అందాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్‌చందర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాల తీరు తెలుసుకుని జిల్లా కలెక్టర్, ఎస్పీలను అభినందించారు. పథకాల అమలులో నిర్లక్ష్యం జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. నిరుపేదలకు భూమి పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరిగినా సహించేది లేదన్నారు. రుణాలు పొందిన లబ్ధిదారులకు సకాలంలో రాయితీ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్‌ను ఎక్కువ మంది లబ్ధిదారులు వినియోగించుకునే విధంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలన్నారు. రుణాలు మంజూరు చేయని బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్‌ను ఆదేశించారు. పారిశ్రామిక పార్కు స్థల కేటాయింపులో ఎస్సీలకు రోస్టర్ పాటించేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎంను ఆదేశించారు. ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో ఇళ్లు లేని నిరుపేద ఎస్సీలకు ఇళ్లు, మరుగుదొడ్లు మంజూరు చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు డాక్టర్ సునీల్ కుమార్‌బాబు, రీసెర్చ్ అధికారి వరప్రసాద్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో మంగీలాల్ అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీల్లో మెరుగైన సేవలందించాలి

భూపాలపల్లి కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి మధుమేహ, బీపీ పరీక్షలు నిర్వహించాలన్నారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించి ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. ప్రాథమిక, ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఆరోగ్య సమితి సమావేశాలు నిర్వహించాలన్నారు. విద్యా సంస్థలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, నిరంతరం వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, అత్యవసర చికిత్స సేవలను మరింత మెరుగుపరచడం వంటి అంశాలపై వైద్యాధికారులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కొమురయ్య, డాక్టర్ రవిరాథోడ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

వానమ్మా.. వందనం!

ముగిసిన నైరుతి.. మురిసిన ఓరుగల్లు

– న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం



ఉమ్మడి వరంగల్ జిల్లాకు వానాకాలం కలిసి వచ్చింది. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. అన్నదాతలు అప్పుడే యాసంగి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జూన్‌లో మొదలైన నైరుతి సీజన్ సెప్టెంబరుతో ముగిసినా అక్టోబరు రెండో వారం వరకు అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

మండలాలవారీగా అధిక వర్షపాతం శాతం

మహబూబాబాద్	
చిన్న గూడురు	117
మరిపెడ	100
నర్సింహులపేట	96
నెల్లికుదురు	60
దంతాలపల్లి	57
మహబూబాబాద్	44
కురవి	42
ములుగు	
ఏటూరునాగారం	101
మంగపేట	47
వెంకటాపురం	40
తాడ్వాయి	37
గోవిందరావుపేట	36
జనగామ	
కొడకండ్ల	50
జనగామ	24
భూపాలపల్లి	
మల్హర్‌రావు	30
కాటారం	28
రేగొండ	23
మహదేవ్‌పూర్	23
వరంగల్	
దుగ్గొండి	42
వర్ధన్నపేట	41
పర్వతగిరి	34
హనుమకొండ	
భీమదేవరపల్లి	34
ధర్మసాగర్	28
ఎల్కతుర్తి	24

సాగుబడికి చెరువుల నీరు

ఇది హసన్‌పర్తి మండలం నాగారం చెరువు. ఉమ్మడి జిల్లాలో 3,900 చెరువులు, కుంటలున్నాయి. ఈసారి 65 శాతం పూర్తి స్థాయిలో నిండాయి. మిగతావాటిలో 50 నుంచి 75 శాతం వరకు నీరు చేరింది. వీటికింద 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.



జిల్లాల వారీగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షపాతం (మి.మీ.)

జిల్లా	సాధారణం	నమోదైంది
ములుగు	1200	1603.8
మహబూబాబాద్	878.0	1280.5
జయశంకర్	985.8	1159.8
వరంగల్	901.0	1082.5
హనుమకొండ	875.7	981.5
జనగామ	755.2	829.2

పంటలకు మేలు

- తోకల ఆదిరెడ్డి, రైతు, సీతంపేట, హసన్‌పర్తి



ఈసారి సకాలంలో వర్షాలు పడ్డాయి. యాసంగిలో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. చెరువులతో పాటు ఎస్సారెస్పీ కాలువల ద్వారా వరి పంటకు నీరందించే అవకాశం ఉన్నందున యాసంగి సాగుపై ఆశలు పెంచుకున్నాం.

సాగు విస్తీర్ణం పెరుగుతుంది

- రవీంద్రసింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో ఆశించిన మేరకు వర్షాలు కురిశాయి. దీంతో జలాశయాల్లోకి వరదనీరు చేరింది. నీరు లేని చెరువుల్లోకి ఎస్సారెస్పీ కాలువల ద్వారా నింపుతున్నారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుంది.



పంటలకు నీరు అందిస్తున్న రైతు




ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో నిండుగా వ్యవసాయ బావి

రైతులకు మద్దతుగా పత్తి కొనుగోళ్లు!

ఈ ఏడాది పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధంగా ఉంది.. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం అని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ తెలిపారు. పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, మద్దతు ధరపై అవగాహన, ఇతర సమస్యల పరిష్కారానికి గురువారం 'ఈనాడు' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు జేడీఎం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

–ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



ఈనాడు ఫోన్ ఇన్

మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.శ్రీనివాస్

? పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకొస్తే.. సీసీఐ కొనుగోలుచేస్తుందా?
- యాకూబ్, కొత్తూరు, ఖానాపురం మండలం, వరంగల్ జిల్లా

✔ రైతులు పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకరావొద్దు. విడి పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ప్లాస్టిక్, గన్నీ సంచుల్లో తీసుకురావడం వల్ల ఆ బస్తాల్లోని పోగులు పత్తిలో కలిసిపోయి నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది. స్పిన్నింగ్ చేసే సమయంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయి.

? ఈ ఏడాది అకాల వర్షాలతో పత్తి దిగుబడి తగ్గింది. కొంతమేర మచ్చ వచ్చి రంగు మారింది. పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ శాతం ఎక్కువగా ఉంది. ఇలాంటి పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందా? **- (శ్రీనివాస్, మరిపెడ, మహబూబాబాద్ జిల్లా), (శివశంకర్, ఆత్మకూరు, హనుమకొండ జిల్లా), (సతీశ్, వెన్నారం, దోర్నకల్), (అన్నా తిరుపతి, ములుగు జిల్లా), (వెంకటేశ్వర్, దోర్నకల్), (తోట రాజేందర్, అబ్బాపూర్, ములుగుజిల్లా)**



✔ నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుంచి 12 వరకు తేమ శాతం ఉంటేనే కనీస మద్దతు ధర రూ.7,521కు సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమశాతం సడలింపు, నాణ్యత లేకున్నా కొనుగోలు చేసే అవకాశం లేదు. రైతులు మొత్తం వచ్చిన దిగుబడిలో మంచి పత్తిని, నాణ్యత లేనిది వేరు చేయాలి. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందొచ్చు. మిగిలినది ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవచ్చు. ఉదయం కాకుండా మధ్యాహ్నం పత్తిని ఏరడం ద్వారా తేమశాతాన్ని తగ్గించొచ్చు.

? ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేసి దాన్ని సీసీఐకి విక్రయిస్తూ.. లబ్ధి పొందుతున్నారు. ఈసారి మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులను నియంత్రిస్తారా? **- (మహేశ్ హాజంపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా), (శ్రీనివాస్, ఖిలాషాపూర్, జనగాం జిల్లా)**

✔ ఈ ఏడాది నోటిఫై చేసిన మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు జరపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహిస్తే. . సంబంధిత మిల్లు యజమానులపై చర్యలు తీసుకుంటాం. సీసీఐ కాకుండా ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు గుర్తిస్తే.. మిల్లుల్లో సమస్యలపై ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన నెంబర్ల ద్వారా సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

? ప్రైవేటు వేబ్రిడ్జిలకు, మిల్లుల్లోని వేబ్రిడ్జిలకు ఒక్కోసారి తూకాల్లో తేడాలు వస్తున్నాయి. దాంతో రైతులు నష్టపోతున్నారు. తూకాల్లో మోసాలను ఎలా అరికడతారు?
- బుస్సారి లక్ష్మణ్, కంచరపల్లి, రఘునాథపల్లి మండలం, జనగామ జిల్లా

✔ మిల్లుల్లో పంట ఉత్పత్తుల తూకాల్లో ఉద్దేశపూర్వకంగా మోసాలకు పాల్పడితే సంబంధించిన వారిపై చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు తూనికలు కొలతలు అధికారులతో వేబ్రిడ్జిల తనిఖీలు నిర్వహిస్తానే. తూకాల్లో తేడాలొచ్చినట్లు అనుమానం వస్తే.. రైతులు.. తూనికలు, కొలతలు, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

తూనికలు, కొలతలు అధికారుల నెంబర్లు

జనగామ - 9440575081
హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లా - 9963311956
వరంగల్ - 9885558028
మహబూబాబాద్ - 9177661663

? దళారులు గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తూ.. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
- బి.సాంబయ్య, నల్లబెల్లి, వరంగల్ జిల్లా

✔ ఆరుగాలం పండించిన పంటను దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దు. దగ్గరలోని మార్కెట్ కమిటీల్లో.. సీసీఐ నోటిఫై చేసిన మిల్లుల్లో పత్తిని అమ్మడం ద్వారా మార్కెటింగ్‌శాఖ రైతుల సరుకు జవాబుదారీగా ఉంటుంది. గిట్టుబాటు ధరతో పాటు నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లిస్తుంది. తరుగు పేరుతో దళారులు చేసే మోసాలకు మార్కెటింగ్‌శాఖ బాధ్యత వహించదు.

? పత్తి రైతుల కోసం మార్కెటింగ్‌శాఖ ప్రవేశపెట్టిన వాట్సప్ నెంబరులో రైతు వ్యక్తిగత చరవాణి నెంబరు నమోదుచేసినా పండించిన పంట వివరాలు రావడం లేదు?
- రమేశ్, దేవరుప్పుల, జనగామ జిల్లా

✔ ఎన్ఐసీ ఇచ్చిన డేటా ఆధారంగా మార్కెటింగ్‌శాఖ పంట నమోదుచేసిన 21,65,326 మంది రైతులతో వాట్సాప్ నెంబరు (88972 81111)ను రూపొందించింది. ఈ నెంబరు సహాయంతో రైతులు సాగుచేసిన పత్తి వివరాలు, ఎన్ని క్వింటాళ్ల వరకు సీసీఐకు విక్రయించేందుకు అవకాశముంది.. తదితర వివరాలను ముందస్తుగా తెలుసుకోవచ్చు. ఇందులో రైతు వివరాలు రానంత మాత్రాన సీసీఐకు పంట విక్రయించవద్దనే నిబంధన లేదు.

? వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పండించిన పంట విస్తీర్ణం కన్నా.. తక్కువ నమోదు చేస్తే. ఏంచేయాలి? **- రవీందర్, తొర్రూర్, మహబూబాబాద్ జిల్లా**

✔ వ్యవసాయ అధికారులు నమోదు చేసిన పంట విస్తీర్ణం ఆధారంగానే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. సీసీఐ నిబంధనల ప్రకారం.. ఆధార్ నెంబరు ప్రామాణికీకరణ, రైతు వేలిముద్రలు, ఓటీపీ ద్వారా ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసే అవకాశముంది. ఒకవేళ వ్యవసాయ విస్తరణాధికారులు సాగు విస్తీర్ణాన్ని తక్కువగా నమోదు చేస్తే.. ఆ రైతులు సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించిన పత్రాన్ని సీసీఐ అధికారులకు సమర్పించాలి.

19 నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

సుబేదారి, న్యూస్‌టుడే: హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి తెలిపారు. గురువారం కళాశాలలో వివరాలు వెల్లడించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 800 మంది హాజరవుతారన్నారు. బ్యాడ్మింటన్‌లో 12, హ్యాండ్‌బాల్‌లో 14, కబడ్డీ 29, ఖోఖోలో 7, సాఫ్ట్‌బాల్‌లో 11 టీములు పాల్గొంటాయన్నారు. ప్రారంభం రోజు నుంచి పోటీలు ముగిసే వరకు మైదానంలో వాకర్స్‌కు అనుమతి లేదన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్, పీడీ భాస్కర్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

ఇసుక దందాపై స్పందించిన కేటీఆర్



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారంపై ఈ నెల 14 'ఇసుక దందా.. వారికి మామూలే' శీర్షికన ఈనాడులో ప్రచురించిన కథనానికి మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని జతపరుస్తూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం అంటూ పోస్టు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఇసుక మాఫియాకు అభయ హస్తం అంటూ వాగ్బాణాలు సంధించారు.

ఈనాడు కథనాన్కి స్పందన

ఆర్టీసీ బస్సులు రైట్.. రైట్..



హనుమకొండలోని నయీంనగర్ కొత్త వంతెన మీదుగా ఆర్టీసీ బస్సులు పరుగులు ప్రారంభించాయి. వంతెన నిర్మాణం పనులు పూర్తై, ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నా.. ఆర్టీసీ బస్సులు తిరగడం లేదని, ఇతర రూట్లలో తిరగడంతో సమయం వృథా కావడంతో పాటు ప్రయాణికులకు టికెట్‌పై అదనపు భారం తప్పడం లేదంటూ 'ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర వార్తకు ఆర్టీసీ, పోలీసు అధికారులు స్పందించారు. వంతెన మీదుగా బస్సులకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచి హనుమకొండ బస్సులను ఈ మార్గంలో పంపించారు. దీంతో కరీంనగర్, హుజూరాబాద్, నిజామాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం ముందుగా బయలు బస్సులకు అదనపు ఛార్జి రూ.10 వసూలు చేశారని, తరవాత బస్సులకు అదనపు ఛార్జి తొలగించామని చెప్పారు. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా విద్యార్థులు, యువతి, యువకులకు జిల్లా, రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా ఈ మధ్య తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివితో తీసిన షార్ట్‌ఫిలిం పెన్‌డ్రైవ్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 22లోపు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పీఆర్‌వోకు అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు పెంచే అంశాలకు సంబంధించి గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు తీసిన ఫొటోలు, షాట్‌ఫిలిం వీడియోలను మాత్రమే పంపించాలన్నారు. పూర్తి వివరాలకు పీఆర్‌వో సెల్ 87126-85050 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వనదేవతల కటాక్షం..

మహా జాతర శాశ్వత పనులకు శ్రీకారం!

మేడారం మహాజాతర పనులు ఎప్పుడూ సమయానికి పూర్తి కావు.. జాతరకు ఐదారు నెలల ముందు సమావేశాలు నిర్వహించడం, రెండు నెలల ముందే నిధులు మంజూరు చేయడం, హడావుడిగా పనులు చేపట్టడం జరుగుతుండేది. ఈ ఆనవాయితీకి స్వస్తి పలికేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. జాతరతో సంబంధం లేకుండా మేడారంలో చేపట్టాల్సిన శాశ్వత పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. –తాడ్వాయి, న్యూస్‌టుడే(ములుగు జిల్లా)



మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి

మేడారం మహాజాతర 2026 ఫిబ్రవరిలో జరిగే అవకాశం ఉంది.. అంటే మరో ఏడాదిన్నర ఉంది.. గత అనుభవాల దృష్ట్యా మహాజాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క ఇప్పుడే ప్రత్యేక దృష్టిసారించారు. గత మే నెలలోనే జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించి మేడారం అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఏయే పనులు ఎప్పుడు చేయాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 4న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కార్యాచరణ ప్రారంభించిన కలెక్టర్

కలెక్టర్ టీఎస్.దివాకర ఇప్పటికే రెండుసార్లు జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. చేపట్టాల్సిన పనులను గుర్తించడం, గత జాతరలో ఎదుర్కొన్న ఇబ్బందులపై పూర్తిస్థాయిలో వివిధ శాఖలను అడిగి తెలుసుకొన్నారు. గత జులై 11న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రూ.17.25 కోట్లు మంజూరు

గతంలో జాతర నిర్వహణకు కొద్దిరోజుల ముందే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండేది. దీంతో అవి పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయ్యేవి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈసారి అధికారులు ముందుగానే మేల్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పంపించిన రూ.17.25 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ప్రతిపాదనలు.. మంజూరైన నిధులు (రూ.కోట్లలో)

- సీఆర్ఆర్ పథకం ద్వారా కాల్వపల్లి నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 8
- మేడారంలోని శివరాంసాగర్ చెరువు నుంచి రిజర్వ్ ఫారెస్టు వరకు రోడ్డు విస్తరణ: 2.75
- ఎమ్మార్ పథకంలో నార్లాపురం చెక్ పోస్టు నుంచి కాల్వపల్లి వరకు తారు దారి: 2.50
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 2
- మేడారం అమరవీరుల స్తూపం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు దారి: 2

వీటిలో కొన్ని టెండరు పూర్తయ్యాయి.. త్వరలోనే పనులన్నీ ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈఈ ధర్మేందర్‌రావు తెలిపారు.

అతిథిగృహాల నిర్మాణానికి..



80 శాతం పూర్తయిన పూజారుల అతిథిగృహం

శాశ్వత ఏర్పాట్లే లక్ష్యంగా దేవాదాయశాఖ రూ.3.50 కోట్లతో అతిథిగృహాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న పూజారుల అతిథి గృహం 80 శాతం పూర్తయింది. భక్తులు, అతిథుల కోసం అతిథి గృహం నిర్మించేందుకు ప్రభుత్వం మరో రూ.2 కోట్లు మంజూరు చేసింది. రెండు రోజుల కిందట అధికారులు స్థల పరిశీలన చేశారు. దేవాదాయ శాఖ నిర్మాణాలు మరో ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు.

19న జాతర పనులకు శంకుస్థాపన

రూ.7.35 కోట్లతో రెండు ప్యాకేజీలుగా చేపట్టే నార్లాపురం చెక్‌పోస్టు-కాల్వపల్లి, ఊరట్టం అమరవీరుల స్తూపం-ఊరట్టం, కన్నెపల్లి ఆర్చిగేటు-సారలమ్మ గుడి, మేడారం ఆర్అండ్‌బీ రోడ్డు-శివరాంసాగర్ చెరువు వరకు రహదారుల నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయింది. మంత్రి సీతక్క ఈ పనులకు 19న శంకుస్థాపన చేయనున్నారు.

బాలికపై వృద్ధుడి అత్యాచార యత్నం

మహాముత్తారం, న్యూస్‌టుడే: బాలికపై వృద్ధుడు అత్యాచార యత్నం చేసిన ఉదంతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ కుమార్ కథనం ప్రకారం..మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉండగా రత్నం రామయ్య అనే 71 ఏళ్ల వృద్ధుడు ఆమె వద్దకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ప్రతిఘటించి కేకలు వేయడంతో వృద్ధుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బుధవారం బాధితురాలు ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. గురువారం కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి


రమేష్(పాతచిత్రం)

మహదేవపూర్, న్యూస్‌టుడే: బెగ్లూర్ సమీప ఎల్అండ్‌టీ రహదారిలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న దోమల రమేష్(35)ను ఇసుక లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు..బెగ్లూరుకు చెందిన వ్యవసాయ కూలీ దోమల రమేష్, ఎం.లక్ష్మీనారాయణ ద్విచక్రవాహనంపై పొలం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. లక్ష్మీనారాయణకు గాయాలువ్వగా మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటన స్థలాన్ని సీఐ రాంచంద్రరావు పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

పంచాయతీ కార్యదర్శికి గాయాలు..

గణపురం, న్యూస్‌టుడే: గణపురం మండలం చెల్పూర్ శివారు కొంపెల్లి కూడలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సరీశ్ తన ద్విచక్ర వాహనంపై భూపాలపల్లి నుంచి చెల్పూర్‌కు వెళుతున్నారు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనను జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

జైలు శిక్ష

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన వారికి భూపాలపల్లి జిల్లా సివిల్ కోర్టు జడ్జి ఎన్.రాంచందర్‌రావు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు గురువారం ఎస్సై బి.అశోక్ తెలిపారు. మొగుళ్లపల్లిలోమద్యం తాగి వాహనం నడుపుతూ వేములపల్లి గ్రామానికి చెందిన తిప్పరబోయిన సతీష్, ముల్కలపల్లి గ్రామానికి చెందిన ఇరుప సురేష్, టేకుమట్ల మండలం గుమ్మడివెల్లి గ్రామానికి చెందిన తోడేటి ఓంకార్, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామానికి చెందిన దురిశెట్టి నవీన్ చారి పట్టుబడ్డారు. వారికి రెండు రోజుల జైలుతో పాటు రూ.1000 జరిమానా విధించారు. గణపురం(ము) మండలం బొబ్బలోనిపల్లి గ్రామానికి చెందిన సిలువేరు హరీష్‌కు మూడు రోజుల జైలుతో పాటు రూ. 1000 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

రేగొండ,న్యూస్‌టుడే: గంజాయి కేసులో ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు ఉదయం కొత్తపల్లి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ ద్విచక్ర వాహనంపై రేగొండ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన కల్యాణ్, హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన రవితేజ అనుమానంగా కనిపించటంతో అదుపులోకి తీసుకొని వాహనాన్ని తనిఖీ చేశారు. ఆ వాహనంలో సుమారు రూ.3500 విలువ చేసే సుమారు 300 గ్రాముల ఎండు గంజాయి కనిపించగా స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం గంజాయి విక్రయాలు జరుపుతున్న కల్యాణ్, రవితేజలను అరెస్టు చేసి రిమాండ్ పంపించామని ఎస్సై చెప్పారు.

చరవాణుల అప్పగింత

గణపురం, న్యూస్‌టుడే: గతంలో పోగొట్టుకున్న చరవాణులను గుర్తించి వాటిని సదరు వ్యక్తులకు గణపురం పోలీసులు గురువారం అందించారు. వివరాల్లోకి వెళితే.. గణపురానికి చెందిన ఎండీ ఇమ్రాన్ పాషా 15 రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గం మధ్యలో చరవాణి పడిపోయింది. అతను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన గండు రమేశ్ రెండు నెలల క్రితం భూపాలపల్లి నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళుతుండగా ఎవరో చోరీ చేశారని గణపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరి ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి గురువారం హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ చేతుల మీదుగా బాధితులకు అందించారు. చరవాణులు గుర్తించడంలో కృషి చేసిన కానిస్టేబుల్ కనుకుంట్ల యాకేశ్‌ను ఎస్సై అశోక్ అభినందించారు.

వాల్మీకి సందేశాలు స్ఫూర్తిదాయకం


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్, కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వాల్మీకి సందేశాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ముందుగా జ్యోతి వెలిగించి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి సందేశాలు సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే విధంగా ఉంటాయన్నారు. ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ, వివిధ కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భూపాలపల్లి: జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తో పాటు ఇతర అధికారులు కలిసి పూలమాల వేసి, నివాళులర్పించారు. రామాయణాన్ని సంస్కృతంలో రచించి, భారతావనికి అందించిన మహనీయుడు వాల్మీకి అని ఎస్పీ కొనియాడారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ బోనాల కిషన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు నగేష్, రత్నం తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూపాలపల్లి: సింగరేణి జీఎం కార్యాలయం ఆవరణలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఎస్ఓటు జీఎం కవీంద్ర వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వాల్మీకి సందేశాల స్ఫూర్తితో కార్మికులు, అధికారులు, యువకులు ముందుకు సాగాలని కవీంద్ర కోరారు. కార్యక్రమంలో అధికారులు రవి కుమార్, సురేఖ, వసంత్, మారుతి, మురళీమోహన్ పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే


నివాళులర్పిస్తున్న సింగరేణి ఎస్ఓటు జీఎం కవీంద్ర తదితర అధికారులు

కోల్ ఇండియా పోటీల్లో కాంస్య పతకం



ఉదయశ్రీ

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ అథ్లెటిక్ పోటీల్లో భూపాలపల్లి సింగరేణి డివిజన్ కేటీకే 6వ గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న ఉదయశ్రీ 4- 100 మీటర్ల రిలే రేస్‌లో కాంస్య పతకం సాధించారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ మహారాణా ప్రతాప్ స్పోర్ట్స్ కళాశాలలో మూడు రోజులుగా పోటీలు నిర్వహిస్తుండగా ఉదయశ్రీ కోల్ ఇండియా తరపున ఆడుతున్నారు. సింగరేణి సంస్థకు పేరుతెచ్చిన ఉదయశ్రీని గురువారం స్థానిక జీఎం హబీబ్ హుస్సేన్, ఎస్ఓటు.జీఎం కవీంద్ర, అధికార ప్రతినిధి మారుతి ఘనంగా సత్కరించారు.

కార్మికుల సమస్యల పరిష్కారం ఎప్పుడు?


కేటీకే 5వ గని ఆవరణలో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయా గనుల అధికారులు, జనరల్ మేనేజర్లు దృష్టి పెట్టాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఎల్ సభ్యులు మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. గురువారం భూపాలపల్లి ఏరియా కేటీకే 5వ గనిలో ద్వార సమావేశాన్ని సీఐటీయూ నాయకులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహారావు మాట్లాడుతూ..సింగరేణి ఎన్నికలు జరిగి 10 నెలలు కావస్తున్నా ఇంత వరకు సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రధానమైన ఆదాయపు పన్ను రద్దు, మారు పేర్ల సమస్య, వివిధ గనుల్లో రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు పరిష్కరించాలని సూచించారు. మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను అర్హులైన వారికి పారదర్శకంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కంపెటి రాజయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

కుమురం భీం వర్ధంతి


కాటారంలో కుమురంభీంకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కాటారం, న్యూస్‌టుడే: స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో కుమురం భీం వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుమురం భీం పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజేందర్, అధ్యాపకులు, సిబ్బంది మాధవి, శ్రీనివాస్, వెంకటయ్య, రాజు, సమ్మక్క, హరిభూషణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

గణపురం, న్యూస్‌టుడే: గణపురం మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన గాజ రమేశ్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనతో పదో తరగతి కలిసి చదివిన మిత్ర బృందం కుటుంబ సభ్యులకు గురువారం రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందించింది. కార్యక్రమంలో రాజేందర్, సంపత్, శ్రీనివాస్, ఎండీ మహబూబ్, మహేందర్, హరిలాల్, రమేశ్, సంపత్, రాజు, జితేందర్ పాల్గొన్నారు.

విజేతగా రామగుండం రీజియన్ జట్టు

యైటింక్లయిన్‌కాలనీ: 53వ జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆర్జీ-2, 3 ఏపీఏ జట్టు.. ద్వితీయ స్థానం భూపాలపల్లి, తృతీయస్థానంలో బెల్లంపల్లి-మందమర్రి జట్లు నిలిచాయి. డ్రిల్ అండ్ పరేడ్‌లో ఆర్జీ-1, థియరీలో ఆర్జీ-2, 3 ఏఎల్‌పీ, ఉత్తమ రెస్క్యూ రిలేలో ఆర్జీ-1, ఉత్తమ నైపుణ్యంలో శ్రీరాంపూర్ డివిజన్, ప్రథమచికిత్సలో మందమర్రి డివిజన్, ఫ్రెష్ ఎయిర్ బేస్‌లో ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం జట్లు ఉన్నాయి. ఉత్తమ రికవరీలో మందమర్రి, బెల్లంపల్లి, ఉత్తమ రెస్క్యూ రికవరీలో ఆర్జీ-2, 3, ఏపీఏ జట్టు, ఉత్తమ కెప్టెన్‌గా అనిల్‌కుమార్, ద్వితీయ స్థానంలో పూర్ణచందర్ విజేతలుగా నిలిచారు. వీరికి భారత బొగ్గు గనుల భద్రత విభాగం ఉన్నతాధికారి ఉమేష్ సావర్కర్, సింగరేణి సంచాలకులు వెంకటేశ్వర్‌రెడ్డిలు జ్ఞాపికలు అందజేశారు.

హనుమకొండ ఏసీపీకి అతి ఉత్కృష్ట సేవా పతకం


కె.దేవేందర్‌రెడ్డి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ఇచ్చే ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 410 మందిని ఎంపిక చేసింది. హనుమకొండ ఏసీపీ కె. దేవేందర్‌రెడ్డికి అతి ఉత్కృష్ట పతకం లభించింది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఈయన 1996లో ఆర్ఎస్సైగా ఉద్యోగంలో చేరారు. తర్వాత సివిల్ ఎస్సైగా కన్వర్షన్ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఠాణాల్లో ఎస్సై, సీఐగా విధులు నిర్వర్తించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సమర్థంగా విధులు నిర్వర్తించి, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. పోలీస్‌శాఖలో పలు పతకాలు అందుకున్న దేవేందర్‌రెడ్డి తాజాగా అతి ఉత్కృష్ట అవార్డుకు ఎంపిక కావడంతో పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.

'జాతీయ రహదారికి భూములు ఇవ్వం'


రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్న అధికారులు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నిర్మాణానికి తమ భూములు ఇవ్వబోమని, బలవంతంగా తీసుకునే ప్రయత్నం చేస్తే మరో పోరాటనికైనా సిద్ధమేనని కాళేశ్వరంలోని కొంతమంది రైతులు తెగేసి చెబుతున్నారు. సుమారు రెండున్నర కిలోమీటర్లు జాతీయ రహదారి నిర్మాణానికి కొంత రైతుల భూమి, మరికొంత అటవీ భూమి సేకరించేందుకు గతంలో ప్రతిపాదనలు చేశారు. గురువారం మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, జాతీయ రహదారి అధికారులు కలిసి క్షేత్ర స్థాయిలో మరోమారు సర్వే చేయడానికి వచ్చారు. అధికారులు వచ్చిన విషయం తెలుసుకున్న దళిత రైతులు ఆ ప్రాంతానికి వెళ్లి అధికారులను అడ్డుకున్నారు. తమకున్న కొద్దిపాటి భూమి ఇస్తే జీవనాధారం కోల్పోవాల్సి వస్తుందని చెప్పినా, తిరిగి సేకరించడమేంటని వారు ప్రశ్నించారు. తమ భూములను ససేమిరా ఇవ్వబోమంటూ అక్కడికి చేరుకున్న మహిళలు అధికారులను అడ్డుకున్నారు. అధికారులు నచ్చజెప్పే ప్రయత్నాలు చేసినా వారు ససేమిరా అనడంతో అధికారులు తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ కృష్ణను సంప్రదించగా జాతీయ రహదారి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేయడానికి వెళ్లామన్నారు. కొంతమంది రైతులు ఇవ్వడానికి సిద్ధపడుతుండగా మరికొందరు ఇవ్వబోమంటున్నారన్నారు.

ఆలయాభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలి

ములుగు రూరల్, న్యూస్‌టుడే: పురాతన శివాలయాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. గురువారం ములుగు మండలం జాకారంలోని శివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఆలయం పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ శాఖ అధికారులకు సూచించారు. ఆలయం హద్దులను గుర్తించి పూర్తి వివరాలను సమర్పించాలని రెవెన్యూ అధికారులకు చెప్పారు. గుడి అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలని పురావస్తు శాఖ అధికారులకు సూచించారు.

20న ఖోఖో ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 20న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆదివారం ఉదయం 6 గంటలకు జేఎన్ స్టేడియంలో హాజరుకావాలని కోరారు. ఎంపికైన బాలబాలికలు ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 98492 10746లో సంప్రదించాలన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో పర్యటించిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌ను గురువారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘాల నాయకులు శాలువాలతో సత్కరించారు. అత్యంత వెనుకబడిన జిల్లా అయిన భూపాలపల్లి అభివృద్ధికి ప్రత్యేకంగా నిధుల మంజూరుతో పాటు నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతి పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీసీ సంక్షేమ జిల్లా నాయకులు భీమనాథుని సత్యనారాయణ, కన్నం యుగేందర్, బట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

భాజపా శ్రేణుల ఘన స్వాగతం


కాటారం, న్యూస్‌టుడే: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌కు భాజపా శ్రేణులు గురువారం కాటారంలో ఘన స్వాగతం పలికాయి. రామగుండం నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రానికి వచ్చిన నేపథ్యంలో అంబేద్కర్ కూడలి వద్ద పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. భాజపా మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, ఇన్‌ఛార్జి సంపత్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

రేగొండ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రంజాన్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కార్యక్రమంపై పీఆర్‌టీయూటీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం రేపాక, రంగయ్యపల్లి, కాకర్లపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా రంజాన్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నేతలు సధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రాజు, లక్ష్మి, సాంబమూర్తి, భిక్షపతి, శ్యాంసుందర్‌రెడ్డి, చరణ్‌కుమార్, విజయ్‌కుమార్, సంధ్యారాణి, హరిత,సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

మస్తుగా తాగేశారు..!

● 14 రోజుల్లో రూ.142.79 కోట్ల మద్యం విక్రయాలు



ఉమ్మడి వరంగల్ జిల్లాలో దసరా సందర్భంగా మద్యం విక్రయాలు రాష్ట్రంలోనే రికార్డును సాధించాయి. రాష్ట్రంలోనే అధిక పెరుగుదల నమోదైంది. వరంగల్ పట్టణ, రూరల్ పరిధిలో 49.88, జనగామ జిల్లాలో 89.87 శాతం విక్రయాలు పెరిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 వైన్స్, 134 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. గతేడాది పండగ సందర్భంగా రూ.95.53 కోట్ల అమ్మకాలు జరిగితే.. ఈసారి అది 14 రోజుల్లోనే రూ.142.76 కోట్లకు చేరడం గమనార్హం. దాదాపు రూ.48.26 కోట్లు ఎక్కువగా జరిగాయి. ఈ నెల చివర్లో దీపావళి ఉండటంతో విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆబ్కారీశాఖ అధికారులు భావిస్తున్నారు. –వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

ఇవీ కారణాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం విక్రయాలు ఎక్కువగా పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది గొలుసు దుకాణాలు. గ్రామగ్రామాన కిరాణ దుకాణాలు, ఇళ్లల్లోనూ విక్రయిస్తున్నారు. సమయపాలన పాటించకుండా అవి తెరిచే ఉంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలు అది దొరుకుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు నగర శివారులో గొలుసు దుకాణాలు ఎక్కువగా ఉండడంతో వారు వైన్స్‌ల నుంచి మద్యం తీసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వరంగల్ నగరంలో ఎక్కువ విద్యా సంస్థలు ఉంటాయి. యువత ఎక్కువగా కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు, పిల్లలకు విక్రయించలేదని చెప్పారు.

యోగాసనాలు.. పేరిణి నృత్యాలు


నృత్య ప్రదర్శన చేస్తున్న పేరిణి రంజిత్ శిష్య బృందం



రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. గురువారం ఉదయం యోగాసనాలతో ప్రారంభమైన శిబిరం సాయంత్రం నృత్య ప్రదర్శనతో ముగిసింది. ప్రొఫెసర్ పాండురంగారావు జియో ఇంజినీరింగ్, కాకతీయ ఆలయాల నిర్మాణశైలిపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ మధు ఒట్టెరే పురాతన కాకతీయ ఆలయాలకు వాడిన మెటీరియల్స్‌పై శిక్షణ తరగతుల్లో వివరించారు. సాయంత్రం రామప్ప ఆలయానికి చేరుకుని పేరిణి నృత్యశిల్పాలను వాలంటీర్లు పరిశీలించారు. అనంతరం పేరిణి రంజిత్ ఆధ్వర్యంలో శిష్యబృందం సంతోష్, గురుదేవ్, లోహిత్, చందు, శ్రీజ, తేజస్విని, సమీక్ష, రత్వికలు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు శ్రీధర్‌రావు, టూరిజం గైడ్లు, పురావస్తు శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, వెంకటాపూర్

ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు


ఎంపికైన క్రికెటర్లతో సంఘం ప్రతినిధులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన ఎంపిక పోటీలకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన అండర్-23 క్రికెటర్లు హాజరయ్యారు. జిల్లాల వారీగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో నైపుణ్యాలు పరీక్షించారు. ఒక్కో జిల్లా నుంచి 18 మంది ఆటగాళ్లను ఎంపిక చేసినట్లు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఆరు జిల్లాల నుంచి 108 మంది క్రికెటర్లను ఎంపిక చేశామన్నారు. ఇందులో నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక కోసం ఈ నెల 20 నుంచి 23 వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం ప్రతినిధులు మట్టెడ కుమార్, వినయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

రంగనాథస్వామిని తాకిన సూర్య కిరణాలు



కాశీబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వర, రంగనాథ స్వామి ఆలయంలో గురువారం ఉదయం స్వామి విగ్రహంపై సూర్య కిరణాలు పడినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి చిలుపూరి సురేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ